క్లుప్తంగా

నేడు విద్యాసంస్థల బంద్

కూసుమంచి: నీట్ ప్రశ్నా పత్రాల లీకేజీ వ్యవహారంలో విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ నేడు (గురువారం) నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, పీడీఎస్‌యూ జిల్లా కమిటీ సభ్యుడు సతీష్ మాట్లాడుతూ.. లక్షలాది రూపాయలకు నీట్ ప్రశ్నాపత్రాలను విక్రయించిన వారిపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. నీట్ చైర్మన్ ప్రదీప్‌కుమార్ జోషి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.

నేడు కరెంట్ కోత

ఖమ్మంఅర్బన్: నగరంలోని రోటరీనగర్, మమత రోడ్డులోని విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని 11 కేవీ డెయిరీ ఫీడర్, 11 కేవీ మైసమ్మ గుడి ఫీడర్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఖమ్మం అర్బన్ సెక్షన్ ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, డెయిరీ ఫీడర్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, మైసమ్మ గుడి ఫీడర్ పరిధిలో 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. దీంతో పోలీసు కాలనీ, రాఘవయ్యనగర్, రాధాకృష్ణనగర్, మమతరోడ్డు, వరదయ్యనగర్, ఇందిరానగర్‌లో తదితర కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

'అద్దంకి' మృతి పార్టీకి తీరని లోటు

ఖమ్మంరూరల్: మండలంలోని కాచిరాజుగూడెంకు చెందిన సీపీఎం నాయకుడు అద్దంకి వెంకన్న మృతి సీపీఎంకు తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. బుధవారం జరిగిన వెంకన్న దశదిన కర్మలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. అమరుల త్యాగాలు వృథా కావు అని, వారి ఆశయ సాధన కోసం నేటి యువత కృషి చేయాలని తెలిపారు. ప్రజా సమస్యల కోసం అద్దంకి పోరాడేవారని, ఆయన కుటుంబానికి సీపీఎం ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు భూక్యా వీరభద్రం, నండ్ర ప్రసాద్, పి.వెంకటరమణ, నాగేశ్వరరావు, పి.మురళి, రామనాథం, సైదులు, వేలాద్రి తదితరులు పాల్గొన్నారు.

కుర్చీల వితరణ



కుర్చీలు అందజేస్తున్న కార్పొరేటర్ వైష్ణవి

ఖమ్మంవన్‌టౌన్: బాలింతలు, గర్భిణుల సౌకర్యం కోసం కార్పొరేటర్ కన్నం వైష్ణవి తన పుట్టినరోజు సందర్భంగా తన డివిజన్ పరిధిలోని ఏడు అంగన్‌వాడీ కేంద్రాలకు కలిపి 35 కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో క్రమశిక్షణతో పాటు సరైన పోషకాహారం లభిస్తుందని తెలిపారు. అంతేకాక అంగన్‌వాడీ కార్యకర్తలు అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి పని చేస్తారని పేర్కొంటూ వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ కవిత, సూపర్‌వైజర్ సత్యశీల, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగలక్ష్మి, రమాదేవి, శ్రీలత, శోభ, రేణుక, సంధ్య, తదతరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో లారీలు ఆపిన యువకులు?

నేలకొండపల్లి: యువత మద్యం మత్తులో లారీలు ఆపి డబ్బులు వసూలు చేసి పరారైన యువకులను బుధవారం స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. నేలకొండపల్లిలోని గ్రామ శివారులో గత నెల 29న కొంతమంది యువకులు అర్ధరాత్రి లారీలను ఆపి డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. కాగా, పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు అటుగా రావడంతో వారు అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో లారీ డ్రైవర్లను విచారించగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తేలడంతో క్షేత్రస్థాయిలో గాలించగా.. మండల కేంద్రానికి చెందిన ముగ్గురు యువకులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై ఎస్సై తోట నాగరాజును వివరణ కోరగా.. వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు.

నిధులు విడుదల చేయాలి

కూసుమంచి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం అయినందున రైతులకు ఎకరాకు రూ.15వేలు, కౌలు రైతులకు ఎకరాకు రూ.12వేలు చొప్పున నిధులు విడుదల చేయాలని కోరారు. అలాగే రుణమాఫీ తక్షణమే అమలు చేయాలని, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలయ్యేంత వరకు తమ పార్టీ ఆధ్వర్యాన ఆందోళనలు చేపట్టనున్నట్లు బీజేవైఎం నాయకులు గుండా ఉపేందర్‌రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, వెంకటరెడ్డి, విజయ్‌పాల్‌రెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

చెత్తగా సేకరణ..!



కేఎంసీ ఆవరణలో నిలిచిన స్వచ్ఛ ఆటోలు

షెడ్‌లో ఆటోలు.. రోడ్ల వెంట వ్యర్థాలు

- మరమ్మతులకు గురవుతున్న స్వచ్ఛ ఆటోలు
- గడువు ముగింపునకు వచ్చిందంటున్న కాంట్రాక్టర్
- నిలిచిపోతున్న ఇంటింటి చెత్త సేకరణ
- ఇబ్బంది పడుతున్న నగరవాసులు
- నిధుల కేటాయింపులో కేఎంసీ అధికారుల జాప్యం



ఎన్నెస్పీ క్యాంప్‌లో రోడ్డు వెంట వ్యర్థాలు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణకు గత ప్రభుత్వం ట్రాక్టర్లు, స్వచ్ఛ ఆటోలను కేటాయించింది. ఇందులో కొన్ని డివిజన్లకు ట్రాక్టర్లు, మరికొన్ని డివిజన్లకు స్వచ్ఛ ఆటోలను కేటాయించి ఇంటింటి చెత్త సేకరణ చేపట్టడంతో పారిశుద్ధ్యం మెరుగుపడింది. రోడ్డు వెంట, కూడళ్లల్లో వ్యర్థాలు కనిపించకుండా పోయాయి. ఇంత వరకు బాగానే ఉన్నా.. గత కొన్ని రోజులుగా కేఎంసీలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారుతోంది. చెత్త సేకరణ వాహనాల మెయింటెనెన్స్ సక్రమంగా లేకపోవడంతో మరమ్మతులకు గురై షెడ్‌కు తరలించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో డివిజన్లలో ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరగకా.. రోడ్ల వెంట వ్యర్థాలు కుప్పలుగా పడుతున్నాయి.

నెలలో ఆగిన ఐదు స్వచ్ఛ ఆటోలు..

చెత్త సేకరణ ఆటోలు మరమ్మతులకు గురై నిలిచిపోతున్నాయి. చెత్త సేకరణ సమయాన డివిజన్‌లోనే ఆటోలు నిలిచిపోవడంతో కార్మికులు చేసేదేమి లేక ఆటోలను పక్కన పెట్టి కేఎంసీ అధికారులకు సమాచారం ఇస్తున్నారు. ఒక్క నెలలోనే ఐదు స్వచ్ఛ ఆటోలు నిలిచిపోయాయి. 54వ డివిజన్, 26వ డివిజన్లలో చెత్త సేకరణ చేసే ఆటోలు నిలిచిపోగా.. 26వ డివిజన్ ఆటోను వెంటనే మరమ్మతులు చేయించి చెత్త సేకరణకు పంపించారు. ఇక 54వ డివిజన్‌లో ఆటోను చాలా రోజుల పాటు పక్కన పెట్టగా, ఆ డివిజన్‌లో చెత్త సేకరించే కార్మికులు సైకిల్ రిక్షా ద్వారా కొన్ని రోజుల పాటు చెత్తను సేకరించారు. అనంతరం అధికారులు ఆ ఆటోకు మరమ్మతులు చేయించి చెత్త సేకరణకు కేటాయించారు. ఇక ఇటీవల 29, 27, 42 డివిజన్లలో ఆటోలు మరమ్మతులకు గురై నిలిచిపోవడంతో ప్రస్తుతం ఇంటింటి చెత్త సేకరణ సమస్యగా మారింది.

నిండుకున్న నిధులు..?

నగరంలో అనేక అభివృద్ధి పనులు, ఇతర మెయింటెనెన్స్‌లకు నిధులు కేటాయిస్తున్న అధికారులు చెత్త సేకరణ వాహనాలకు మాత్రం నిధులు కేటాయించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. స్వచ్ఛ ఆటోలు నిలిచిపోతున్నా వాటిని మరమ్మతులు చేయించడంలో జాప్యం వహించడంపై విమర్శలు వస్తున్నాయి. ప్రతీ రోజు చెత్త సేకరణ జరిగితేనే డివిజన్లలో పారిశుద్ధ్యం మెరుగ్గా ఉంటుందని, ఏ ఒక్క రోజు చెత్త సేకరణ జరగకపోయినా వ్యర్థాలు రోడ్లపైకి చేరుతాయని కార్మికులు పేర్కొంటున్నారు. డివిజన్లలో చెత్త సేకరణకు ఆటోలు రావడం లేదని ఆరా తీయగా.. ఆటోలు మరమ్మతులకు గురయ్యాయని, వాటిని బాగు చేయించేందుకు కేఎంసీలో నిధులు లేవని స్థానిక కార్మికులు పేర్కొంటున్నారని ప్రజలు వాపోతున్నారు. ఆటోల మెయింటెనెన్స్ చూడాల్సిన ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని, కాంట్రాక్టర్ల చేత ఆటోల మరమ్మతులు చేయించడంలో వెనకడుగు వేస్తున్నారనే విమర్శలు కేఎంసీలో ఉన్నాయి. దీనిపై కేఎంసీ అధికారులను వివరణ కోరగా.. ఆటోల మెయింటెనెన్స్ చూసే కాంట్రాక్టర్ గడువు ముగింపునకు వచ్చిందని, ఆటోలను మరమత్తులు చేయించి, చెత్త సేకరణ సజావుగా సాగేలా చూస్తామని తెలిపారు.

అభివృద్ధి పనులపై కమిషనర్ ఆరా



గోళ్లపాడు చానల్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్, లకారం ట్యాంక్‌బండ్, గోళ్లపాడు చానల్‌లను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య బుధవారం సందర్శించారు. అధికారులతో కలిసి ఆయా ప్రాంతాలను పరిశీలించి, అక్కడ జరిగిన అభివృద్ధి పనులు, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పార్కుల్లో వసతులపై ఆరా తీసి ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట ఎస్ఈ రంజిత్, కేఎంసీ ఈఈ కృష్ణాలాల్, డీఈలు, టౌన్‌ప్లానింగ్ అధికారులు ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ధర్నా..

పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్

ఖమ్మంవైద్యవిభాగం: పెండింగ్ జీతాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి పారిశుద్ధ్య కార్మికులు బుధవారం ధర్నా నిర్వహించారు. మాతా శిశు సంరక్షణ కేంద్రంలో షెడ్‌లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు విధులు బహిష్కరించిధర్నా చేయగా.. సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణువర్ధన్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జి.రామయ్య మాట్లాడుతూ.. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న కార్మికులకు గత నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, దీంతో పెరిగిన ధరలతో కార్మికుల కుటుంబాలు తిని తినక పస్తులు ఉండాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. జీతాలు చెల్లించాలని కాంట్రాక్టర్‌ను ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జీతాలు ఇవ్వని కాంట్రాక్టర్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకటరమణ, విజయమ్మ, అంబేద్కర్, అంజలి, సీతారాములు, సత్యవతి, పద్మ, రాధ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

బంజారాల పండుగలకు నిధులు ఇవ్వాలి

ఖమ్మం మామిళ్లగూడెం: బంజారాలు సంప్రదాయంగా జరుపుకునే పండుగలకు సెలవు ప్రకటించడమే కాక నిధులు కేటాయించాలని గోర్‌బంజారా ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూక్యా శోభన్‌నాయక్ కోరారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లో ప్రభుత్వ సలహాదారుడు ఎండీ.షబ్బీర్ అలీ, ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్, జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ హుస్సేన్‌నాయక్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ జన్మదినం, సీత్లా, తీజ్ పండుగలు ఘనంగా జరుపుకునేలా ప్రతీ తండాకు రూ.లక్ష చొప్పున నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి బచ్చునాయక్‌తో పాటు రాములు, కోటేశ్వరరావు, శ్రీనివాస్, కిరణ్ సింగ్, కేవ్లాబాబు, బాలుసింగ్, దేవ్లా, సైదులు, రాములు, బాలాజీ, దేవేందర్, రవీందర్, హరిలాల్ పాల్గొన్నారు.

విచారణ చేపట్టాలి..

ఖమ్మం మామిళ్లగూడెం: చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన రైతు బోజడ్ల ప్రభాకర్ మృతిపై విచారణ చేయాలని బీజేపీ ఖమ్మం పార్లమెంట్‌కు పోటీ చేసిన అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు మృతి పట్ల భిన్న కథనాలు వెలుగులోకి వస్తున్నాయని, అధికారులు కూడా రైతుల సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తే ఇటువంటి మరణాలను తగ్గించే అవకాశం ఉంటుందన్నారు.

వరి నారు పెంపకంలో మెళకువలు పాటించాలి

కూసుమంచి: వరి నారుమళ్ల పెంపకంలో తగిన మెళకువలు పాటించాలని ఏఓ వాణి రైతులకు సూచించారు. బుధవారం నాయకన్‌గూడెం గ్రామంలో వరి నారుమళ్లను పరిశీలించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. నారుమళ్ల గట్లను సన్నగా తయారు చేసుకుని కలుపు లేకుండా చూడాలన్నారు. నారుమడిలో కాండం తొలుచు పురుగుల నివారణకు ఎసిఫేట్, క్లోరీఫైరిఫాస్ ద్రావణాన్ని పిచికారీ చేయాలని, నారు తీసే వారం ముందు మడుల్లో కార్బోఫ్యూరాన్ గుళికలను చల్లాలని, అధిక వర్షం ఉన్నట్లయితే ప్రాపికొనజోల్ ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి లాభదాయక పంటల సాగును చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నిఖిల, రైతులు పాల్గొన్నారు.

● తెగిన తీగలతో తంటాలు..



రోడ్డుపై వేలాడుతున్న వైర్లు



పక్క నుంచి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న ఆటోవాలా

నగరంలోని పలు ప్రాంతాల్లో కేబుల్, ఇతర నెట్‌వర్క్‌లకు సంబంధించిన పలు వైర్లు తెగి వేలాడుతూ ప్రయాణికులను ఇబ్బందులు గురిచేస్తున్నాయి. నగరంలోని ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయం వద్ద (మయూరిసెంటర్ బ్రిడ్జి సందు) వన్ వే కావడంతో నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఇటువంటి ప్రాంతంలో బుధవారం మూడు, నాలుగు కేబుల్ తదితర వైర్లు తెగి వేలాడుతుండడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. చిన్న సందు కావడంతో ఓ ఆటో అటుగా వస్తున్న క్రమంలో వైర్లు తగిలి తెగడంతో ఆ ఆటో డ్రైవర్ తెగిన వైర్లను తొలగించుకొని వెళ్లిపోయాడు. ఇదంతా చూసిన జనం ఏ సమయంలో ఏం జరుగుతుందోననే ఆందోళన చెందుతున్నారు.

– ఖమ్మం సహకారనగర్

సంఘం బలోపేతానికి కృషి

ఖమ్మం మామిళ్లగూడెం: పద్మశాలీలంతా ఐక్యంగా ఉండి సంఘ అభివృద్ధికి కృషి చేయాలని పద్మశాలి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి కోరారు. అభ్యుదయ పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు జెల్లా లక్ష్మీనారాయణ ఆ సంఘం నుంచి పద్మశాలి సంఘంలో చేరారు. బుధవారం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మురళి మాట్లాడుతూ.. రాష్ట్రంలో తమ సంఘంలో పనిచేసే వారికి సముచిత స్థానం కల్పించబడుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు బొమ్మా రాజేశ్వరావు, శ్రీనివాసబాబు, తాటి శ్రీనివాస్, రచ్చ శ్రీనివాస్, జనార్దన్, బండారు శ్రీనివాస్, సత్యనారాయణ, కొండల్‌రావు, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారా లీగల్స్‌ను రెవెన్యూ శాఖలో విలీనం చేయాలి

నేలకొండపల్లి: పారా లీగల్స్‌ను రెవెన్యూ శాఖలో విలీనం చేయాలని పారా లీగల్స్ అండ్ కమ్యూనిటీ సర్వే అసోసియేషన్ (సెర్ప్) రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దపాక వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం ఈమేరకు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సీఎంఆర్‌ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ లచ్చిరెడ్డి, ధరణి కమిటీ సభ్యుడు బి.సునీల్‌లను హైదరాబాద్‌లో కలిసి అందించారు. ఈ సందర్భంగా పెద్దపాక వెంకటేశ్వరరావు మాట్లాడుతూ..భూ సమస్యలపై అనుభవం ఉన్న పారా లీగల్స్ అండ్ కమ్యూనిటీ సర్వేయర్‌లను రెవెన్యూ నూతన చట్టం వ్యవస్థలోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శంకరయ్య, నరసింహ, మహేష్, సాయిలు, శ్రీను, నిర్మల, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ఎగ్జిట్ పాయింట్ ఇవ్వాలి

నేలకొండపల్లి: కోదాడ-కురవి జాతీయ రహదారిపై నేలకొండపల్లి మండల కేంద్రానికి సమీపంలోని ఆచార్లగూడెం వద్ద ఎగ్జిట్ పాయింట్ ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకుడు గుడవర్తి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేలకొండపల్లి మండల ప్రజలకు నేషనల్ హైవేపై వెళ్లే అవకాశం కల్పించేందుకు ఆచార్లగూడెం వద్ద ఎగ్జిట్ పాయింట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి, మండదపు మురళీకృష్ణ, మంకెనపల్లి నరసింహారావు, బొడ్డు మధు, మధుసూదన్, వెంకటేశ్వర్లు, బాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని పాత ఎస్‌ఎన్‌మూర్తి కాలేజీలో కొనసాగుతున్న మహాత్మ జ్యోతిపూలే వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కాలేజీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వేంసాని వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ లేదా తత్సమానమైన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు నేటి (గురువారం) నుంచి ఈ నెల 8వ తేదీ వరకు దరఖాస్తులు అందిస్తే మెరిట్ ఆధారంగా 10వ తేదీన స్పాట్ అడ్మిషన్ ఇవ్వబడుతుందన్నారు. వివరాలకు 70326 32863, 99639 30931 నంబర్లను సంప్రదించాలన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ



రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్న అధికారులు

కామేపల్లి: రైతు భరోసా పథకంపై కొండాయిగూడెం సహకార సంఘం ఆధ్వర్యాన స్థానిక రైతువేదికలో బుధవారం ప్రత్యేక మహా జనసభ నిర్వహించి రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా హన్మకొండ డీసీఓ నీరజ మాట్లాడుతూ..రైతుల అభిప్రాయాలే ప్రామాణికంగా తీసుకుని రైతు భరోసా అమలు చేస్తారన్నారు. ఈనేపథ్యాన పలువురు రైతులు మాట్లాడుతూ.. ఎలాంటి షరతులు లేకుండా సాగు చేసిన భూమంతటికీ రైతు భరోసా ఇవ్వాలని కొందరు తెలపగా, పదెకరాల వరకు పరిమితం చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రభుత్వ పింఛన్ పొందేవారు, గౌరవ వేతనం పొందే వారికి రైతు భరోసా అమలు చేయవద్దని మరికొందరు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇచ్చేలా చూడాలని పలువురు కోరారు. సొసైటీ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీదేవి, ఆడిటర్ కల్యాణి, శంకర్, ఏడీఏ శ్రీనివాసరావు, డీసీసీబీ డైరెక్టర్ మల్లిబాబుయాదవ్, ఏఓ తారాదేవి, ఏఈఓ మున్నీ, కొండాయిగూడెం ఆయకట్టు మాజీ చైర్మన్ యలమద్ది అప్పారావు, డైరెక్టర్లు దేవేందర్, వీరభద్రరావు, విఠల్‌రావు, మహేష్, మల్లేష్, సీఈఓ ముత్తయ్య, రైతులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలను రద్దు చేయాలి



దీక్షలో కూర్చున్న న్యాయవాదులు

ఖమ్మం లీగల్: అమల్లోకి వచ్చిన నూతన కొత్త చట్టాలను రద్దు చేయాలని పలు న్యాయవాద సంఘాల నాయకులు డిమాండ్ చేస్తూ బుధవారం ఖమ్మం కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన రిలే నిరాహార దీక్ష చేపట్టారు. నూతన కొత్త చట్టాలు ప్రజలు, న్యాయవాదులకు వ్యతిరేకంగా ఉన్నాయని, ఈ చట్టాలను రద్దు చేయాలని బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ కోరారు. ఈ దీక్షలో చింతనిప్పు వెంకట్, పి.అమర్ చంద్, బిచ్చాల తిరుమలరావు, గొల్లపూడి రామారావు, పొట్లపల్లి విప్లవ్‌కుమార్, పిడతల రామ్మూర్తిలు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో షేక్ లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, ఏడునూతల శ్రీనివాసరావు, మందడపు శ్రీనివాసరావు, మేకల సుగుణారావు, ఆర్.పావెల్, ఆకుల శేఖర్ బాబు, కొత్త వెంకటేశ్వరరావు, మీసాల వెంకటేశ్వర్లు, వి.లక్ష్మీనారాయణ, తన్నీరు పాపయ్య, సోడే ధర్మేంద్ర, వల్లాల శ్రీను, బాను, కె.క్రాంతికుమార్, వడ్డేలి కృష్ణమూర్తి, దండా సుధాకర్, నేరేళ్ల శ్రీనివాసరావు, న్యాయవాదులు పాల్గొన్నారు. కాగా, దీక్షలో ఉన్న న్యాయవాదులకు సీనియర్ న్యాయవాది కేవీ.సత్యనారాయణ నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.

'దేశాన్ని అప్పుల ఊబిలో నెట్టిన కేంద్రం'

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తప్పుడు విధానాలతో దేశం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటూ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని సీపీఎం రాష్ట్ర నాయకుడు యర్రా శ్రీకాంత్ ఆరోపించారు. బుధవారం సుందరయ్యభవన్‌లో జరిగిన సీపీఎం ఖమ్మం అర్బన్ రాజకీయ శిక్షణా తరగతులను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అధిక ధరలతో ప్రజలను దోచుకోవడంతో 60 శాతం మందికి పౌష్టికాహారం అందడం లేదని, 80 శాతం మందికి సరైన వైద్య సౌకర్యాలు అందడం లేదన్నారు. కార్పొరేట్, పెట్టుబడిదారులకు పెద్దపీట వేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాబోయే కాలంలో జరిగే రాజకీయ ఆందోళనల్లో పార్టీ శ్రేణులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్, జిల్లా కమిటీ సభ్యుడు బండారు రమేష్, నాయకులు మీరాసాహెబ్, బత్తిని ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ

ఖమ్మంవన్‌టౌన్: పంచాయతీరాజ్ శాఖలో ఎస్ఈ చంద్రమౌళి పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ బుధవారం తన చాంబర్‌లో పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. తన శేష జీవితం కుటుంబసభ్యులతో ఆనందంగా గడపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వినోద్, డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి, జిల్లా పరిషత్, పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో కూసుమంచి విద్యార్థినులకు సీటు

కూసుమంచి: కూసుమంచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు పాసిని శ్రీజ, తంగేళ్ల మహాలక్ష్మిలు బాసరలోని ప్రతిష్టాత్మక ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ఈమేరకు బుధవారం వీరిని ఎంఈఓ బీవీ రామాచారి, హెచ్‌ఎం రాయల వీరస్వామితో పాటు ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన



ప్రమాణం చేస్తున్న వివిధ సంఘాల బాధ్యులు

ఖమ్మంగాంధీచౌక్: అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల వాడుక నిషేధ దినోత్సవం సందర్భంగా బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన నగరంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. వాకర్స్ క్లబ్, ఫిమేల్ యోగా క్లబ్ తదితరులతో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం అధ్యక్షుడు, ప్రభుత్వ వైద్యుడు బొలికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వివిధ అవసరాల నిమిత్తం మార్కెట్, కిరాణ వంటి దుకాణాలకు వెళ్లినప్పుడు ప్లాస్టిక్ సంచులు కాకుండా వెంట కాటన్, జ్యూట్ వంటి బ్యాగ్‌లు తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం కాటన్ చేతి సంచులను పంపిణీ చేసి ప్లాస్టిక్ వినియోగించమని ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గెల్లా శ్రీరామ్, కోశాధికారి ఎ.గోవిందరావు, ప్రతినిధులు విశ్వేశ్వరరావు, డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, డాక్టర్ శ్రీదేవి, యోగా పరివార్ అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి, కార్యదర్శి ప్రతిమ, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ డి.పూర్ణచందర్‌రావు, కార్యదర్శి ఖాదర్‌బాబు, రమేష్, పుల్లయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రజాపాలన ఎడిటింగ్



దరఖాస్తులు అందిస్తున్న లబ్ధిదారులు

రఘునాథపాలెం: ప్రజాపాలన దరఖాస్తుల్లో దొర్లిన తప్పిదాలను సరిచేయించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించడంతో మండల ప్రజలు మండల పరిషత్ కార్యాలయానికి బారులుదీరారు. ఈమేరకు బుధవారం రేషన్‌కార్డు, విద్యుత్ బిల్లులోని నంబర్లు తప్పులు దొర్లిన 270 మందికి సంబంధించిన దరఖాస్తులు సరిచేసినట్లు అధికారులు తెలిపారు.

అటెన్షన్ ప్లీజ్

బోర్డులు కనిపించట్లే..!



నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలను చెట్ల కొమ్మలు కమ్మేశాయి. దీంతో కార్యాలయాల బోర్డులు కనిపించక వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. నగరంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్‌లో విద్యుత్ శాఖకు చెందిన గెస్ట్‌హౌస్, ఖమ్మం రూరల్ డివిజన్, సబ్ డివిజన్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, డీఈ కన్‌స్ట్రక్షన్స్, విజిలెన్స్ సెల్ తదితర కార్యాలయాలు ఉన్నాయి. కానీ వీటికి సంబంధించిన నేమ్ బోర్డులను రహదారి వెంట పెంచిన చెట్ల కొమ్మలు కమ్మేయడంతో ఇదిగో ఇలా కనబడడం లేదు. దీంతో వివిధ సెక్షన్ల పరిధిలోని వినియోగదారులు విద్యుత్ సమస్యలు, బిల్లులు, నూతన కనెక్షన్లు తదితర అవసరాల కోసం వస్తున్న వారు కార్యాలయాల బోర్డులు కనిపించక ఇబ్బంది పడుతున్నారు. దగ్గరకు వెళ్లి చూసేంతా వరకూ కనిపించడం లేదు. విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే విద్యుత్ శాఖ తమ కార్యాలయాల బోర్డులు కనిపించకుండా ఉన్నా పట్టించుకోకపోవడం శోచనీయం. ఇకనైనా అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

- ఖమ్మం వ్యవసాయం